క్లుప్తంగా

నేడు గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమావేశం

మాచర్ల: నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత వైద్యుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు గ్రామీణ వైద్యులు కె.శ్రీనివాసరాజు, అధ్యక్షుడు సదా శివరాజ్, ఆర్గనైజర్ ఎం.సిద్ధేశ్వరాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాసుకొండ కల్యాణ మండపంలో శ్రీకృష్ణ జనరల్ హాస్పిటల్ వైద్యుడు గుర్రం రాజశేఖర్‌రెడ్డి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి హాజరవుతారని చెప్పారు. ఉదయం 11గంటలకు కార్యక్రమం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

కోడ్ ఉల్లంఘన.. వలంటీరుపై వేటు

అచ్చంపేట: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన చిగురుపాడు వలంటీరు అన్నం పూర్ణచంద్రరావును విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో కె.కుసుమకుమారి తెలిపారు. శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ చిగురుపాడు గ్రామానికి చెందిన అన్నం పూర్ణచంద్రరావు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే కాకుండా టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ద్వారా ఆ పార్టీ కండువా కప్పించుకుని బహిరంగంగా చేరారని, అందువల్ల అతనిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల ప్రక్రియ పూర్తి

నకరికల్లు: పోలింగ్ స్టేషన్ల ప్రక్రియకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తహసీల్దారు ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. అక్కడ మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు. పీఓలు, ఏపీఓల నియామకంతో పాటు అదనపు పోలింగ్ అధికారుల నియామకం కొరకు ఉన్నతాధికారుల ఉత్తర్వులు అందాయని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

రెండు నామినేషన్లు దాఖలు

సత్తెనపల్లి: జై భీమ్ రావు భారత్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా జొన్నలగడ్డ విజయ్ కుమార్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. అలాగే స్వతంత్ర అభ్యర్థిగా షేక్ దరియావలి రెండవ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఇద్దరూ తమ నామినేషన్ పత్రాలను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి. మురళీకృష్ణకు అందించారు. తహసీల్దారు సీహెచ్ ఉష ఉన్నారు.

తండ్రి వేధింపులపై కేసు నమోదు

ముప్పాళ్ళ: తండ్రి వేధింపులపై కుమార్తెలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.హజరత్తయ్య శనివారం తెలిపారు. వివరాల మేరకు..ముప్పాళ్ళలోని ముస్లిం కాలనీకి చెందిన భార్యాభర్తలు షేక్ మాబు సుభాని, రిహానా కుటుంబ సమస్యలతో వేర్వేరుగా ఉంటున్నారు. మాబు సుభాని పిడుగురాళ్ళలో నివాసముంటుండగా, రిహానా తన ఇద్దరు ఆడ పిల్లలతో కలిసి ముప్పాళ్ళలో ఉంటోంది. మాబు సుభాని గురువారం ముప్పాళ్ళ వచ్చి రిహానా, పిల్లలతో ఘర్షణకు దిగాడు. ఈ నేపథ్యంలో పెద్ద కుమార్తె ఆసియా, భార్య రిహానా ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడిపూడిలో బాల్య వివాహం నిలిపివేత

సత్తెనపల్లి: సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో బాల్య వివాహం జరగకుండా శనివారం అధికారులు నిలిపివేశారు. గ్రామంలో బాల్య వివాహం జరుగుతుందని చైల్డ్ హెల్ప్ లైన్‌కు గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన బాల్య వివాహాల నిరోధక ప్రొటెక్షన్ అధికారి ప్రశాంత్ కుమార్ శనివారం గ్రామాన్ని సందర్శించి, బాల్య వివాహాన్ని నిలిపివేశారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలను బాలిక తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ ఆర్.అరుణ, జీఎంఎస్ కె.భాగ్యలక్ష్మి, నౌరీన్, వీఆర్వో, ప్రధానోపాధ్యాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఎన్నికల్లో జగన్‌దే ప్రభంజనం

- చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు
- కందిపాడు, వన్నాయపాలెంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రచారం



కందిపాడులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: ప్రస్తుత ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే ప్రభంజనమని.. చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు అని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శనివారం రాత్రి మండలంలోని కందిపాడు, వన్నాయపాలెం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండు గ్రామాలలో భారీగా తరలివచ్చిన ప్రజలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. బహిరంగ సభలో ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ.. కందిపాడులో గత ఐదేళ్లలో రూ.10.49 కోట్లతో సంక్షేమం, రూ.2.20 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ఇందులో కనీసం నాలుగో వంతు అయినా టీడీపీ ప్రభుత్వం అందించిందా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ మరోసారి సీఎం అయితేనే ఈ సంక్షేమ పథకాలు అందుతాయని.. చంద్రబాబు వస్తే వీటిని ఆపేస్తారని పేర్కొన్నారు. అమరావతి – బెల్లంకొండ రోడ్డు త్వరలోనే పూర్తి అవుతుందన్నారు. కానీ చంద్రబాబు దాన్ని మళ్లీ నిర్మిస్తామని బూటకపు హామీలు ఇస్తున్నారన్నారు. చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు అని.. టీడీపీకి అసలైన వారసులు ఆయన్ను పార్టీ నుంచి గెంటేస్తారని జోస్యం చెప్పారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే.. ప్రతి ఇంటికీ తాగునీరు, ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారు. పులిచింతల బ్యాక్ వాటర్ నుంచి నాగిరెడ్డిపాలెం చెరువుకు నీళ్లు తెచ్చి.. అక్కడి నుంచి కాల్వల ద్వారా బెల్లంకొండ, అచ్చంపేట, క్రోసూరు మండలాలకు తాగునీరు, సాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారు. అది పూర్తి చేసిన తర్వాత 2029లో మళ్లీ ఓటు అడుగుతానని స్పష్టం చేశారు. పెదకూరపాడు ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా అనిల్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు మరియదాసు, అహ్మద్‌పాషా, జిల్లా కమిటీ నాయకులు సాయిరెడ్డి, భద్రయ్య, సర్పంచ్‌లు కంభంపాటి పాప, త్రివేణి, ఎంపీటీసీలు తిరుపతమ్మ, ప్రసాదరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ముస్లింల పక్షపాతి సీఎం జగన్

- టీడీపీకి ముస్లింల ఓటు ఒక్కటీ పడకూడదు
- షాదీ ఖానాల నిర్మాణానికి హామీ
- ఈ నెల 25న నామినేషన్‌కు తరలి రావాలి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



నందిగామ సమావేశంలో మాట్లాడి, అభివాదం చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ముస్లింల పక్షపాతి మహా నేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు, ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఈ నెల 25న తన నామినేషన్ పురస్కరించుకొని జన సమీకరణలో భాగంగా ఆయన శనివారం నందిగామ గ్రామంలో పర్యటించారు. ముస్లిం వర్గాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది వైఎస్సార్ అని గుర్తుచేశారు. సీఎం జగన్ ముస్లిం సోదరుడికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారన్నారు. నకరికల్లు మండలం గుండ్లపల్లిలో రూ. 50 లక్షలు, కొండమోడులో రూ.30 లక్షలతో ముస్లింల షాదీ ఖానాల నిర్మాణానికి కృషి చేశానన్నారు. పట్టణంలో 50 ఏళ్లుగా ముస్లిం సోదరులు నమాజ్ చేసుకుంటున్న రూ.9.50 కోట్ల విలువైన స్థలాన్ని ప్రభుత్వం నుంచి సీఎం జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో మసీదుకు అందించామని మంత్రి అంబటి తెలిపారు. నందిగామలో ఈసారి మెజార్టీ రావాలన్నారు. ఈ నెల 25న నామినేషన్ దాఖలు చేస్తున్నానని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, ఏఎంసీ మాజీ చైర్మన్ సాంబయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాసరావు, నల్లబోతు శివనారాయణ, మర్రి సుబ్బారెడ్డి, స్థానిక నాయకులు సయ్యద్ రసూల్, కొల్లా నరేష్, జంగాల సంపత్ కుమార్, రెంటపాళ్ళ అక్కేశ్వరరావు, పైర్ల సుబ్బారావు, బలిజేపల్లి మస్తాన్, బంకా యోహన్, మీరయ్య, ఆళ్ళ జగ్గయ్య, యర్రం శ్రీను, నన్నపనేని వాసు ఉన్నారు.

వైఎస్సార్ సీపీలోకి జోరుగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి అంబటి రాంబాబు



టీడీపీ నేత సుధాకరరెడ్డిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నంబూరు



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులతో ఎమ్మెల్యే నంబూరు



వైఎస్సార్ సీపీలోకి దొడ్లేరు టీడీపీ కార్యకర్తలను ఆహ్వానించిన ఎమ్మెల్యే నంబూరు



వైఎస్సార్ సీపీలో చేరిన బయ్యవరం జనసేన కార్యకర్తలు



చంద్రాజుపాలెం నాయకులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకరారవు

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. క్రోసూరులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ముత్తన పల్లి నాగేశ్వరరావు(మాజీ సొసైటీ అధ్యక్షుడు), జొన్నలగడ్డ శ్రీనివాసరావు, షేక్ యాసిన్, ఆకారపు గోపి , టీడీపీకి చెందిన గంగోలు మరియదాసులను వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నాయకులు వీర రాఘవయ్య, మిఖేల్, బాషా తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట: మండలంలోని తాళ్ల చెరువుకు చెందిన టీడీపీ నేత పెంటారెడ్డి సుధాకరరెడ్డి శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. క్రోసూరు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గ్రామ సర్పంచ్ కిక్కురు అర్లారెడ్డి తదితరులున్నారు.

సీఎం జగన్ పాలనకు ఆకర్షితులై చేరికలు

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా అందించిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని 6వ వార్డు నుంచి టీడీపీకి చెందిన ఒంటిపులి శ్రీను, ఒంటిపులి రామారావు, సాయి, శివరామ్, కోదండరాములు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని మంత్రి అంబటి రాంబాబు సాదరంగా ఆహ్వానించి, పార్టీ కండువాలు కప్పారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. గుంటూరు మేస్త్రీ షేక్‌జానీ ఉన్నారు.

క్రోసూరు: వైఎస్సార్ సీపీలోకి చేరికలు జోరుగా కొనసాగుతున్నాయి. మండలంలోని దొడ్లేరు, బయ్యవరం, క్రోసూరు గ్రామాల నుంచి శనివారం జనసేన, టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. దొడ్లేరు నుంచి టీడీపీ కార్యకర్తలు తాళ్లూరి పెద్ద ప్రసంగి, చిన్న ప్రసంగి, దేవదానం, కొండే పోగు మునెమ్మ, తాళ్లూరి కోటయ్య, బంక కోటేశ్వరరావు, తాళ్లూరి మేరి బాబు, తాళ్లూరి రవికుమార్ తదితరులు వైఎస్సార్ సీపీలోకి చేరారు.

- మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్తలు కోసనా చిన్న అప్పారావు, శివ నాగేశ్వరరావు, కృష్ణయ్య, శివయ్య, రామ మంగేశ్వరరావు తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
- క్రోసూరుకు చెందిన టీడీపీ కార్యకర్తలు బొరిశెట్టి వెంకట్రావు, మాసాబత్తుల సురేష్, షేక్ సుభాని, షేక్ బుజ్జి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. క్రోసూరు చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు షేక్ హసన్, పటాన్ ఖాసింలను కూడా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
- **అనంతవరం(క్రోసూరు):** అనంతవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త దర్శి ఏసయ్య ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.

బెల్లంకొండ: మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలోని కాపు సామాజిక వర్గానికి చెందిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు కొవ్వూరి నరసింహారావు, రాము, వెంకయ్య, చక్రాల పుల్లయ్య, చక్రాల శంకు, చిరుమళ్ళ రామ కోటేశ్వరరావు, యాసం శీను, గురుజాల రామకోటయ్య, పుల్లమ్మ, చిన్న లక్ష్మమ్మ, గోవర్ధన, గురుజాల తులసి, గురుజాల వెంకటలక్ష్మి, పుట్టియ్య, రామకోటయ్య, పెద్ద పుట్టయ్య, చిన్న రామకోటయ్య తదితరులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. వెంకటాయపాలెం గ్రామానికి చెందిని టీడీపీ కార్యకర్త నందికొండ లక్ష్మయ్య వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే శంకరరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మహిళా సాధికారతకు సీఎం జగన్ కృషి



తాళ్లచెరువులో నంబూరు వసంతకుమారికి అపూర్వ స్వాగతం



అంబటి విజయలక్ష్మికి హారతిస్తున్న మహిళ

ప్రచార పర్వం

సత్తెనపల్లి: మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేశారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సతీమణి అంబటి విజయలక్ష్మి అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని 28వ వార్డులో శనివారం ఆమె ఇంటింటికి పర్యటించారు. మే 13న జరిగే పోలింగ్‌లో సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న తన భర్త అంబటి రాంబాబును, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. మహిళలు హరతులు పట్టి ఆమెకు స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హసంతి, మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి, 28వ వార్డు కౌన్సిలర్ షేక్ తాహేరున్నీసా, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వృందా కళాశాల డైరెక్టర్ అనూష గంగారపు, నాయకులు షేక్ మహ్మద్ గని, అచ్యుత శివప్రసాద్, శెట్టి ఆనంద్,శిరిగిరి వెంకట్రావు, దేవరవెట్టి రవికుమార్ పాల్గొన్నారు.

అపూర్వ స్వాగతం

అచ్చంపేట: పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి నంబూరు వసంతకుమారి మండలంలోని తాళ్ల చెరువులో శనివారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలు ఆమెకు హారతుల్చి అపూర్వ స్వాగతం పలికారు. ఇంట్లో మనిషిలా అందరితో కలివిడిగా పెద్దమ్మ, పిన్నమ్మ, అక్క, చెల్లిమ్మ, అవ్వా, తాతా, అన్నా, బాబాయ్ అంటూ వరసలు కలుపుతూ ఓటు అభ్యర్థించారు.

రాజుపాలెం: పేదల పక్షపాతి జగనన్నకు అన్ని వర్గాల వారు అండగా ఉండాలని, సంక్షేమం కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా సీఎం కావాలని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు తనయ డాక్టర్ మనోజ్ఞ పేర్కొన్నారు. అనుపాలెంలో శనివారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా అంబటి రాంబాబును, నర్సరావుపేట ఎంపీ అభ్యర్థిగా అనిల్‌కుమార్ యాదవ్‌కు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.



అనుపాలెంలో కరపత్రం అందజేస్తున్న మనోజ్ఞ

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న చిగురుపాడు వలంటీర్లు

అచ్చంపేట: మండలంలోని చిగురుపాడు సచివాలయానికి చెందిన పది మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి ఉమా మహేశ్వరరావుకు అందజేశారు. రాజీనామా చేసిన వారిలో షేక్ సైదా, పఠాన్ మస్తాన్ వలి, తాళ్లూరి సుకుమార్, దుద్దుల రవికుమార్, పోలిశెట్టి సతీష్, పాడి శ్రీలత, సానం అచ్చియ్య, సంకు శ్రీనివాసరావు, డేగల గోపరాజు, కుంభా గోపీ ఉన్నారు.

తొమ్మిది మంది వలంటీర్ల రాజీనామా

రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన తొమ్మిది మంది గ్రామ వాలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. రాజీనామ పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ పగడాల ముక్కంటికి అందజేశారు.

1, 2, 3 సెర్చ్..!

- అకస్మాతుగా కార్డన్ సెర్చ్‌లు
- ఎన్నికల వేళ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అమలు

సత్తెనపల్లి: అకస్మాత్తుగా..అనుకోకుండా.. మన ఇంటికి పోలీసులొస్తే.. మన అనుమతి లేకుండానే ఇంట్లోకి చొరబడి ఇళ్లంతా వెతికి వెతికి.. మనల్ని ప్రశ్నిస్తే.. ఏం జరుగుతుందో.. ఎందుకొచ్చారో? అసలు కారణం ఏమిటో? అర్థం కాకుండానే మొత్తం తనిఖీలు చేస్తే? అబ్బో ఆ అయోమయం, ఆందోళనే వేరు. కానీ ఇదంతా పోలీసుల కార్డన్ సెర్చ్‌లో భాగం . పోలీసులు అప్పటికప్పుడు ఓ ప్రాంతాన్ని ఎంచుకొని, అక్కడున్న ఇళ్ల తనిఖీ చేసి, స్థానికుల వివరాలను సేకరిస్తూ ఆసాంతం జల్లెడ పట్టడమే కార్డన్ సెర్చ్ ఉద్దేశం. దీనివల్ల అనుమానిత వ్యక్తులు దొరుకుతారు. నేరం చేసిన వ్యక్తుల కదలికల్లో వచ్చే తేడాలు పోలీసులకు అర్థమవుతాయి. నేరం చేయడానికి సన్నద్ధం అవుతున్న ఆలోచనలకు బ్రేక్ పడుతుంది. ఇలా ఎన్నో లాభాలుంటాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ మధ్య కాలంలో తరచూ జిల్లాలో కార్డన్ సెర్చ్‌లు జరుగుతున్నాయి. అసలు వీటి లక్ష్యం ఏమిటో తెలుసుకుందాం రండీ..!

ఎలా నిర్వహిస్తారంటే

పోలీసులు ఏ పరిస్థితుల్లో అయినా కార్డన్ సెర్చ్ నిర్వహించవచ్చు. ఎన్నికల సమయం, నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు, మురికి వాడలు, పాత నిందితులు ఎక్కువగా తిరిగే ప్రాంతాలు, శివారు ప్రాంతాలను ఎంచుకొని ముందుగా ఆయా ప్రాంతవాసులకు ఎలాంటి సమాచారం లేకుండా.. పోలీసులు అకస్మాత్తుగా వచ్చి ప్రతి ప్రాంతాన్ని, ఇంటిని, వస్తువులు, వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు.

ఏం చేస్తారు..

ఒకేసారి పోలీసు బలగాలన్నీ కాలనీలను చుట్టుముడతాయి. ఎవరూ బయటకు వెళ్లకుండా బయట ప్రాంతాల వారు రాకుండా చూస్తారు. ఆయా ప్రాంతాల్లో ప్రతి అణువు జల్లెడ పడతారు. అక్కడున్న వాహనాలు, అనుమానిత వస్తువులు, ఇతర విషయాలపై ఆరా తీస్తారు. రికార్డులు పరిశీలిస్తారు. ఏదైనా అనుమానంగా తోస్తే వెంటనే చర్యలు ఉంటాయి. దీనిలో సుమారు 500 నుంచి 1000 మంది వరకు పోలీసు బలగాలు పాల్గొంటాయి. దాదాపు ఈ సెర్చ్‌లన్నీ రాత్రి వేళల్లో, తెల్లవారుజామున నిర్వహిస్తారు. ఆ సమయంలో అయితేనే నేరస్తుల కదలికలు తక్కువగా ఉంటాయి. వారిని పట్టుకోవడం సులభంగా ఉంటుంది. ఈ సమయంలో అంతా ఇట్టివద్దే ఉండే అవకాశం ఉంది. విచారణ సులువుగా ఉంటుంది.

ఎలా గుర్తిస్తారు...

ముందస్తుగా ఎంపిక చేసిన కాలనీల్లోకి సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది వెళ్తారు. ప్రతి ఇంటికి నోటీసు ఇచ్చిన అనంతరం ఇంట్లోని వారి వివరాలు నమోదు చేస్తారు. వారి వద్ద ఉన్న ఆధార్, ఇతర రికార్డులు తనిఖీ చేస్తారు. అనుమానం ఉంటే అదుపులోకి తీసుకుంటారు. తనిఖీ చేసినట్లు ప్రతి ఇంటికి ఓ స్లిప్ ఇస్తారు. అలాగే రికార్డులు లేని వాహనాలు ఉంటే వాటిని కోర్టుకు అప్పగిస్తారు.

ప్రజలు ఏం చేయాలి

ప్రజలు కార్డన్ సెర్చ్‌లో పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలి. వారి వద్ద ఉన్న గుర్తింపు కార్డులు, ఇంట్లో ఉన్న వారి వివరాలు, బంధువులు వస్తే వారి వివరాలను తెలియజేయాలి. పోలీసులు వచ్చినప్పుడు ఆందోళన చెందకుండా.. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానమివ్వాలి. పాత నేరస్తులు, అనుమానస్పద వ్యక్తులు తెలిస్తే సమాచారం ఇవ్వాలి.

అప్రమత్తంగా ఉండాలి



సత్తెనపల్లి: అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సత్తెనపల్లి అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం వద్ద అవగాహన సమావేశం నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి తెలియజేయాలన్నారు. ఫైర్ ఇంజిన్ వచ్చేలోపు వీలైనంత వరకు మంటలను నియంత్రించేందుకు నీటిని చల్లాలని సూచించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మెన్‌లు షేక్.గౌస్, ఆర్.హుస్సేన్, ఎ.శ్రీనివాసరావు, సాగర్‌బాబు, రామ కృష్ణ, శ్రీనివాసరావు, మోహన్ బాబు, మహేందర్‌రెడ్డి, రమణ నాయక్, సుభాని, బాజీ, నాగేశ్వరరావు, గోవిందు పాల్గొన్నారు.

పీఎం రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభం

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్డులో ఉన్న పెద కాలువకు సమీపంలో డాక్టర్ పీఎం రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ (స్విమ్మింగ్ పూల్) ను రాష్ట్ర జలవనురుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించారు . శుక్రవారం రాత్రి ఆయన స్విమ్మింగ్ పూల్, బాక్స్ క్రికెట్, ఓపెన్ థియేటర్, చిన్నపిల్లల విభాగాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. సత్తెనపల్లి స్థాయికి భారీ పెట్టుబడి పెట్టి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేయడం పట్ల ఆయన నిర్వాహకులను అభినందించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ పి. మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ గీతా హసంతి, డాక్టర్ రాజమోహన్‌రెడ్డి, గీతిక కంప్యూటర్స్ హర్డ్‌వేర్ చందూ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీరామనవమి వసంతోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని 21, 22 వార్డుల పరిధిలో వేంచేసి ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వసంతోత్సవం పూజలు శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజల్లో రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. ఉత్సవాల అనంతరం ఈ ఆలయం వద్ద అన్న సంతర్పణ చేశారు. వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, కౌన్సిలర్లు రవి కుమార్, శెట్టి ఆనంద్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు నరసింహరావు, ప్రసాద్, శంకర్, హేమలత ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గురజాల: మండలంలోని గురజాల, దైద, పులిపాడు గ్రామాల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ మస్తాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గురజాల, దైద, పులిపాడు గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లకు సంబంధించి మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.